క్లుప్తంగా

మట్టి ప్రతిమల పంపిణీ



పెదకూరపాడు: స్థానిక జన చైతన్య సమితి ఆధ్వర్యంలో పెదకూరపాడులో మట్టి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ గల్లా బాబు రావు, టీడీపీ నాయకులు భాష్యం ఆంజనేయులు మాట్లాడుతూ మట్టి విగ్రహాలు పూజించడం ద్వారా పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. నిర్వాహకులు నరేంద్ర, తుళ్లూరు సాంబశివరావు, జనచైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి బెనిబాబు, కొరపాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరులో ముసురు

క్రోసూరు: మండలంలో రెండు రోజులుగా ముసురు పట్టింది. గత శుక్రవారం రాత్రి నుంచి ఆదివారం వరకు తేలిక పాటి వర్షం కురుస్తూనే ఉంది. రోడ్లన్నీ చిత్తడిగా మారిపోయాయి. వినాయక చవితి ముసురు పట్టుకుందని ప్రజలు అంటున్నారు. వాతావరణ శాఖ వర్ష సూచనలతో భారీ వర్షాల భయం రైతులు, ప్రజల్లో నెలకొంది.

బియ్యం స్వాధీనం

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం గ్రామంలోని ఓ గృహంలో నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన 27 బస్తాల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించారు. బియ్యాన్ని పట్టుకొని గృహానికి చెందిన వి.శ్రీనివాసరెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ డి.అశోక్ తెలిపారు.

కోతుల స్వైర విహారం.. ఇద్దరికి గాయాలు

నరసరావుపేట: స్థానిక అరండల్‌పేటలో నివాసం ఉంటున్న విజయ్‌కుమార్, బంధువు మాధవిలపై శనివారం కోతులు దాడి చేశాయి. ఈ దాడిలో మాధవి చేతి మణికట్టు తెగిపోయింది. వెంటనే ఆమెకు స్థానిక ప్రైవేటు వైద్యశాలలో చికిత్స చేయించారు. కాగా, ఇటీవల కోతుల దాడి నుంచి తప్పించుకోబోయి కింద పడి 19వ వార్డుకి చెందిన మరో మహిళ గాయపడింది. వరవకట్ట, ప్రకాష్‌నగర్, అరండల్‌పేటలో విపరీతంగా కోతులు సంచరిస్తున్నాయి. వీటి నుంచి తమను రక్షించాలని పట్టణ ప్రజల కోరుతున్నారు.

ఉచిత యోగ శిక్షణ శిబిరం

నరసరావుపేట ఈస్ట్: శ్రీవేంకటేశ్వర యోగ సేవాకేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో ఉచిత యోగ శిక్షణ శిబిరం ఆదివారం నుంచి ప్రారంభించినట్లు ఉపబోధక యోగా గురువు జల్లి శ్రీనివాసరావు తెలిపారు. బరంపేటలోని శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం ఆవరణలోని శ్రీసీతారామ కళ్యాణ మండపంలో ప్రతిరోజు ఉదయం 5 నుంచి 7గంటల వరకు 28రోజుల పాటు యోగ శిక్షణ ఉంటుందని వివరించారు. వివరాలకు 9247191553లో సంప్రదించాలని కోరారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

నరసరావుపేట రూరల్: ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడిని ఈనెల 4వ తేదీన కోటప్పకొండ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు వదిలి వెళ్లారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రూరల్ ఎస్‌ఐ సిహెచ్.కిషోర్ అక్కడకు చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న వృద్ధుడిని ఏరియా వైద్యశాలలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం వృద్ధుడు మృతిచెందాడు. మృతుడి వివరాలు తెలిసిన వారు రూరల్ పోలీసులను సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.

నేడు అవధాన కళాకేళి

నరసరావుపేట ఈస్ట్: అవధాన పురస్కారాల ప్రదానం, అవధాన కళాకేళి సోమవారం నిర్వహించనున్నట్లు శ్రీనరసరావుపేట కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పొన్నపాటి ఈశ్వరరెడ్డి ఆదివారం తెలిపారు. శ్రీశృంగేరి శంకరమఠంలోని శ్రీభారతీ తీర్థమహాస్వామి ప్రాంగణంలో సోమవారం సాయంత్రం ఐదు గంటలకు శ్రీకొప్పరపు కవుల కళాపీఠం , శ్రీనరసరావుపేట కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో కళాపీఠం 22వ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాలలో భాగంగా ద్విభాషా శతావధాని పాలడుగు శ్రీచరణ్ అష్టావధాన ప్రక్రియ నిర్వహిస్తారని వివరించారు. అలాగే కొప్పరపు సీతారామప్రసాదరాయ కవి శత జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అవధాన పండితులు మాడుగుల నాగఫణిశర్మ, పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, బులుసు అపర్ణ, కడిమెళ్ల వర ప్రసాద్ తదితరులను పురస్కారాలతో సత్కరించనున్నట్లు వెల్లడించారు. తెలుగు భాషాభిమానులు, కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

దండాలయ్యా.. బొజ్జ గణపయ్య

- వాడవాడలా కొలువుదీరిన గణనాథులు
- భక్తిశ్రద్ధలతో వేడుకలు
- సత్తెనపల్లి నియోజకవర్గంలో 427 విగ్రహాలు ఏర్పాటు

సత్తెనపల్లి: వినాయక చవితి పర్వదిన వేడుకలు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ప్రతి వార్డులో వినాయక ప్రతిమలను కొలువుదిర్చి జై బోలో గణేష్ మహరాజ్‌కి జై అంటూ నినదించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 427 వినాయక విగ్రహాలు కొలువు దీరాయి. శని, ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు కుటుంబ సమేతంగా పార్వతీసుతుడికి శాస్త్రోక్తంగా ప్రథమ పూజలు నిర్వహించారు. ఆయా మండపాల కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



సత్తెనపల్లి ష్యూర్‌గార్డెనియాలో పూజలు చేస్తున్న భక్తులు



సత్తెనపల్లి గాంధీచౌక్ వద్ద కొలువు దీరిన వినాయకుడు



సత్తెనపల్లి రామాలయం వద్ద..




క్రోసూరు లిటిల్ గణేష్ మండపంలోని గణనాథుడు



రాజుపాలెం: బలిజేపల్లి రామాలయం వద్ద లంబోదరుడికి పూజలు



అన్న సంతర్పణలో మాజీ మేయర్ కన్నా నాగరాజు



ముప్పాళ్ల: కుందురువారిపాలెంలో భారీ గణనాథుడు



నకరికల్లు చౌత్రా సెంటర్‌లో భారీ గణనాథుడికి ప్రత్యేక పూజలు



బెల్లంకొండ పాపాయపాలెం జెడ్పీ పాఠశాల వద్ద గణనాథుడికి పూజలు



బెల్లంకొండ వెంకటాయపాలెంలో గణనాథుడు



పెదకూరపాడు దాబాలు సెంటర్లో గణేష్ ఉత్సవాలను ప్రారంభిస్తున్న జీడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ వరప్రసాద్



అమరేశ్వరాయలంలోని ఉపాలయంలో వినాయక స్వామికి పూజలు



అమరావతి: కృష్ణానదిలో నిమజ్జనానికి క్రేన్‌తో వినాయకుడి విగ్రహం తరలింపు



అమరావతి: ఊరేగింపుగా నిమజ్జనానికి గణనాథుడు



గుండెపూడి వారి వీధిలో కొలువు దీరిన లంబోదరుడు



శ్రీ సనారి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆశ్రమంలో మహా గణపతికి పూజలు

అమరావతిలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

అమరావతి: ప్రపంచంలోనే చారిత్రాత్మక శైవ క్షేత్రం అమరావతిలో మౌలిక సదుపాయాలు లేక యాత్రికులు, గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి.రవిబాబు అన్నారు. ఆదివారం కామ్రేడ్ తల్లం బ్రహ్మయ్య స్మారక భవనంలో నిర్వహించిన పార్టీ అమరావతి శాఖ మహా సభలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఈ సభకు కామ్రేడ్ ఏసయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ.. శాశ్వత డ్రెయినేజీ సౌకర్యం, సురక్షితమైన ఫిల్టర్ చేసిన మంచి నీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అమరావతి గ్రామ ప్రజల సమస్యలను అధ్యయనం చేసి, పరిష్కారం కోసం చర్చించడం జరిగిందన్నారు. అమరావతిని ఆహ్లాదకరమైన ప్రదేశంగా తీర్చిదిద్దాలన్నారు. జిల్లా కమిటీ సభ్యురాలు జి.మల్లేశ్వరి మాట్లాడుతూ అగస్టీన్, పల్లోటి కాలేజీ, ఆర్‌వీవీఎస్ ధాన్య కటక కళాశాలల విద్యార్థినులను ఆకతాయిలు ఇబ్బంది పెడుతున్నారని, పోలీస్‌లు చర్యలు తీసుకోవాలని మహాసభలో తీర్మానించినట్లు ఆమె తెలిపారు. పార్టీ సీనియర్ కామ్రేడ్ షేక్ నాగుల మీరా జెండాను ఆవిష్కరించారు. శృంగారపాటి రాజకుమార్, ఎం.సుబ్రహ్మణ్యం, సీహెచ్ మురహరి, ఎస్కే రఫీ, తుడుం కృష్ణ, ఎస్డీ మోహిద్దీన్ వలీ, పలు అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

• కల్వర్టు నిర్మించండి సారూ

క్రోసూరు: క్రోసూరులోని చెరువు పక్కగా మంత్రాలమ్మ గుడి దారి నుంచి పోలాలకు వెళ్లే రోడ్డులో ఉన్న కల్వర్టు వద్ద పరిస్థితి ఇది. చెరువు వెనుక వైపున స్థానిక రైతులు 1,500 ఎకరాలు సాగు చేస్తున్నారు. అనేక కారణాల వల్ల ఐదేళ్ల క్రితం కల్వర్టు కూలిపోయింది. వెంటనే స్పందించి రైతులే స్వయంగా కల్వర్టు స్థానంలో తూములు వేసి, మట్టి తోలించారు. ప్రస్తుతం కురిసిన భారీ వర్షాలకు చెరువు పొంగి తూములు మీద వేసిన మట్టి కొట్టుకుపోయింది. దీంతో తూములు బయటపడి దారి లేకుండా పోయింది. ఖరీఫ్ సీజన్ కావటంతో రైతులు అవస్థలు పడుతున్నారు. పొలాలకు వెళ్లేందుకు ఇదే మార్గం కావడంతో..వారి బాధలు వర్ణనాతీతం. కల్వర్టు పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో ఉండటంతో అధికారులు వెంటనే క్షేత్ర స్థాయిలో సందర్శించి, కల్వర్టు నిర్మించాలని రైతులు కోరుతున్నారు. పంచాయతీ రాజ్ ఇన్‌చార్జి ఏఈని ఈ సమస్యపై ఫోన్ ద్వారా సంప్రదించగా అందుబాటులో లేరు.



ఉపవాస ప్రార్థనలు

దాచేపల్లి: ప్రకృతి విపత్తుల నుంచి కాపాడేందుకు ఉపవాసంతో క్రీస్తుని ప్రార్థించాలని పాస్టర్ రెవ. జీఎస్ ప్రసన్నకుమార్ అన్నారు. మండలంలోని కేసానుపల్లి క్రీస్తు లూథరన్ దేవాలయంలో ఉపవాస ప్రత్యేక ప్రార్థనలు ఆదివారం నిర్వహించారు. భారీ వర్షాల నుంచి ప్రజలను కాపాడాలని, పంటల దిగుబడులు రావాలని, సీజనల్ రోగాలు తొలగిపోవాలని ప్రార్థనలు చేశారు. పాస్టర్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. పవిత్రంగా చేసే ప్రార్థనలు క్రీస్తు ఆలకించి, జవాబు అనుగ్రహిస్తారని చెప్పారు. ప్రత్యేక గీతాలను ఆలపించారు. వినుకొండ అజయ్‌కుమార్, వజ్రం బృందం గీతాలను ఆలపించారు. ఏఈఎల్‌సీ డేలిగేట్ వినుకొండ బాబు, చర్చి డేలిగేట్ శ్రీపతి కాశయ్య, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ఇండియన్ ఐకానిక్ టీచర్ అవార్డు ప్రదానం

పెదకూరపాడు: ఉత్తమ విద్యా బోధనతో అత్యుత్తమ భావితరాలను రూపుదిద్దే ఉపాధ్యాయులకు జాతీయ స్థాయిలో ఇచ్చే ఇండియన్ ఐకానిక్ టీచర్ అవార్డుకు పెదకూరపాడు విజయ విహార్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నోముల కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఆదివారం గుంటూరులో నిర్వహించిన అవార్డు ప్రధానోత్సవంలో లండన్ ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ సీనియర్ ప్రొఫెసర్ మురుగుడు శ్రీహరి, కన్నా మాస్టార్ చేతుల మీదుగా కోటేశ్వరరావు అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాస్టార్‌కి పాఠశాల సెక్రటరీ కె.శ్రీకాంత్, తోటి విద్యార్థులు అభినందనలు తెలిపారు.



అవార్డును అందుకుంటున్న నోముల కోటేశ్వరరావు

చర్చి నిర్మాణానికి రూ.30 వేలు విరాళం

సత్తెనపల్లి: మండలంలోని గుడిపూడి గ్రామంలో నిర్మించనున్న పరిశుద్ధ మత్తయ్ లూథరన్ దేవాలయ చర్చి నిర్మాణానికి అంబేడ్కర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ముందుకు వచ్చింది. పట్టణంలోని సీయోను లూథెరన్ చర్చిలో శనివారం గుడిపూడి పాస్టర్ రెవరెండ్ నవీన్‌చంద్ర, సంఘస్తులకు రూ. 30 వేలు విరాళాన్ని అసోసియేషన్ బాధ్యులు అందించారు. బాధ్యులు కేబీఆర్‌జే ప్రసాద్, ఎన్‌పీ.ప్రసాద్ రాజు, మనికే సంగీత రావు, దారా లూర్ధయ్య, తురకా రాజు, దారా జాషువా, పారా రాంప్రసాద్, కొల్లూరి ప్రసాద్, పెనుమాక నాని, నేలటూరి రమేష్, రెవ స్వరూప్ కుమార్ పాల్గొన్నారు.



విరాళం అందిస్తున్న అసోసియేషన్ బాధ్యులు

చికిత్స కోసం 'వెస్సో' ఆర్థిక సాయం

పిడుగురాళ్ల: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయై చికిత్స పొందుతున్న తాళ్లూరి శ్రీనివాసచారి వైద్య ఖర్చుల నిమిత్తం వెస్సో ట్రస్టు ద్వారా రూ.54,800ల సాయం అందించినట్లు ట్రస్టు అధ్యక్షుడు బంగారు తాతారావు ఆదివారం తెలిపారు. పట్టణానికి చెందిన శ్రీనివాసచారి చిరుద్యోగి. గుంటూరు ప్రైవేటు హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న తన తండ్రికి సర్జరీ చేయించేందుకు కుమార్తె సంధ్య ఆర్థిక సాయం కోసం వెస్సో ట్రస్టును ఆశ్రయించింది. పిడుగురాళ్ల సామాజిక సేవకుడు రాగి నరసింహారావు చేతుల మీదుగా నగదు చెక్కును కుటుంబ సభ్యులకు అందించి, సాయం చేశారు. దీంతో అధ్యక్షుడు తాతారావు దాతలకు ధన్యవాదాలు తెలిపారు.



నగదు చెక్కు అందజేస్తున్న వెస్సో ట్రస్టు సభ్యులు

పేరుకుపోతున్న చెత్త

మాచర్ల: పట్టణంలోని పురపాలక సంఘ పారిశుద్ధ్య కార్మికులను విజయవాడకు వరద బాధితుల సహాయార్థం పంపారు. దీంతో స్థానికంగా పలు ప్రాంతాలలో చెత్తాచెదారం తీసేవారు లేక పేరుకుపోతోంది. రింగు రోడ్డు సెంటర్, బస్టాండ్, రైల్వే స్టేషన్ వీధి, అనేక చోట్ల చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. పారిశుద్ధ్య కార్మికులు ఐదు రోజుల క్రితం వెళ్లారు. ఆదివారం మరోసారి 25 మందిని విజయవాడకు పంపారు.

కారెంపూడి మాజీ సర్పంచ్ మృతి

కారెంపూడి: కారెంపూడి గ్రామ మాజీ సర్పంచ్ అన్నపరెడ్డి వెంకటేశ్వర్లు (70) శనివారం మృతి చెందారు. కొంత కాలంగా వెంకటేశ్వర్లు అనారోగ్యంతో బాధపడుతున్నారు. స్థానిక దాచేపల్లి వెళ్లే రోడ్డులో ఉన్న ఆయన నివాసంలో శనివారం సాయంత్రం మృతి చెందారు.ఆయన మృతి పట్ల పలువురు మాజీ సర్పంచ్‌లు, వివిధ పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఇంట్లో చోరీ

వెల్దుర్తి: మండలంలోని గొట్టిపాళ్ల గ్రామంలో శనివారం అర్ధరాత్రి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు పల్లపాటి గురుబ్రహ్మం ఇంట్లో చోరీ జరిగింది. ఎవరూ లేని సమయంలో ఇంటి తలుపులు పగలకొట్టి రూ.2 లక్షల విలువైన వస్తువులు దొంగతనం చేశారు. బంధువులు గురుబ్రహ్మంకు విషయం తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ ఎం.సత్యనారాయణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వాషింగ్ మిషన్, ఫ్రిడ్జ్, ఏసీ, ఇలా విలువైన వస్తువులను దొంగిలించారని, వాటి విలువ రూ.2 లక్షల వరకు ఉంటుందని బాధితుడు వాపోయాడు.